క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కిషన్‌పుర, సిక్కువాడ, పద్మాక్షి ప్రాంతంలో ఉదయం 8.30 నుంచి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని హసన్‌పర్తి, పెంబర్తి, గంటూరుపల్లి, సీతంపేట గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీ అశోక్ తెలిపారు. ఈమేరకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

నేడు ఎన్ఎస్ఎస్ అధికారుల సమావేశం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కళాశాలల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం అధికారుల సమావేశాన్ని ఈనెల 21న కేయూలోని సెనెట్‌హాల్‌లో ఉదయం నిర్వహించనున్నట్లు కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు టీజీఓఎస్ కార్యవర్గం ఎన్నిక

హన్మకొండ అర్బన్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖల నూతన కార్యవర్గ సభ్యులను హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలోని టీజీఓ భవన్‌లో గురువారం జరగనున్న సమావేశంలో ఎన్నుకోనున్నట్లు సంఘం ఇరు జిల్లాల కార్యదర్శులు సీహెచ్.ప్రవీణ్‌కుమార్, పీఎస్.ఫణికుమార్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

24న పద్మశాలి వనభోజన మహోత్సవం

ఖిలా వరంగల్: ఈనెల 24న ఖిలా వరంగల్ వాకింగ్ మైదానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పద్మశాలీల కార్తీక మాస వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్ తెలిపారు. ఈమేరకు ఖిలా వరంగల్ వాకింగ్ మైదానాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.

30న ఏబీఎస్ఎఫ్ ఆవిర్భావ సభ

విద్యారణ్యపురి: ఈనెల 30న కేయూలో నిర్వహించనున్న ఏబీఎస్ఎఫ్ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆవిర్భావ సభ కరపత్రాలను జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల నరేష్‌తో కలిసి బుధవారం ఆవిష్కరించారు.

'ఆర్ట్స్' పీఆర్వోగా హరికుమార్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పీఆర్వోగా డాక్టర్ వేదాంతం హరికుమార్‌ను నియమించారు. ఈమేరకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి ఉత్తర్వులు జారీచేశారు.

నృత్యకారిణికి బహుమతి

హన్మకొండ కల్చరల్: వరంగల్‌కు చెందిన సంకు శరణ్యారెడ్డి బాలోత్సవ్ –2024 కూచిపూడి నృత్య పోటీల్లో పాల్గొని ద్వితీయస్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాలోని వసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ)లో జరిగిన బాలోత్సవ్ కార్యక్రమంలో కూచిపూడిలో ప్రతిభ కనబరిచి బహుమతి అందుకున్నారు.

టీజీసెట్‌లో జయంతి ప్రతిభ

కేయూ క్యాంపస్: అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకుల ఉద్యోగాలకు అవసరమైన తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష టీజీసెట్ –2024 ఫలితాల్లో హిందీ సబ్జెక్టుకు సంబంధించిన ఫలితాల్లో డాక్టర్ జయంతి ప్రతిభ కనబరిచారు. ఈమేరకు రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం ఆమె సీకేఎం కళాశాలలో అతిథి అధ్యాపకురాలుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

వరంగల్: అత్తింటి వేధింపులు భరించలేక వరంగల్ 21వ డివిజన్ లోతుకుంటకు చెందిన తూడి సునీల్(36) బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు. మిషన్ భగీరథ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సునీల్‌కు ఏడేళ్ల క్రితం దివ్యతో వివాహం కాగా, వారికి ఆరేళ్ల కూతురు ఉంది. సునీల్ తల్లి తూడి రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ వివరించారు.

పలువురిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదానికి కారణమైన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. కారు ఢీకొట్టిన ఘటనలో ఎండీ.ఖాజాపాషా ఫిర్యాదు మేరకు ఎండీ.షఫీ, ఎండీ.సమత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

మోసం చేసిన ఇద్దరిపై..

రామన్నపేట: రూ.2,500 నుంచి రూ.3,500ల వరకు చెల్లించిన వ్యక్తి.. మరో 500ల మందిని చేర్పిస్తే రూ.13,500 నగదు చెల్లిస్తామని నమ్మించి మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై..

ఖిలా వరంగల్: ఓ వ్యక్తిపై దుర్భాషలాడుతూ దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. వరంగల్ గిరిప్రసాద్‌నగర్‌కు చెందిన దేసిని మధుసూదన్, పూజ దంపతులు అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 14న రాత్రి వారిపై పక్కింటి వ్యక్తి నాగబాబు ఈ రాత్రి ఏం ముచ్చట్లు అంటూ దుర్భాషలాడుతూ రాడుతో దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారు.

అద్దె భవనాల్లో కార్యాలయాలు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న అధికారులు, ప్రజలు

కాజీపేట: పాలనా సౌలభ్యం కోసం గత బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. అయితే, అన్ని శాఖల కార్యాలయాలకు సొంత భవనాలను మాత్రం సమకూర్చలేదు. దాంతో వివిధ అవసరాల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలతో పాటు అధికారులు స్థలభావం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకొర వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాల్లో అవస్థలు తప్పడం లేదు. రాష్ట్రంలో 2016వ సంవత్సరంలో దసరా పండగా సందర్భంగా కొత్త మండలాల ఏర్పాటుకు అప్పటి సర్కారు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేసింది.



అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్

హనుమకొండ మండలం నుంచి కాజీపేటను వేరు చేసి 10 గ్రామాలతో మండలంగా ప్రకటించింది.

మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో..

తహసీల్దార్, ఐకేపీ కార్యాలయాలు, డిస్పెన్సరీ ఆస్పత్రి, శాఖ గ్రంథాలయం, మీసేవా కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని సిద్ధార్థనగర్ కాలనీలో ఏర్పాటు చేశారు, చాలీచాలని గదుల్లోనే, సిబ్బంది కొరత, సరైన గదుల లేకపోవడంతో ఆయా శాఖల అధికారులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. సొంత భవనాల కోసం సంబంధిత అధికారులు కనీస చర్యలు కూడా చేపట్టడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలకు రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తున్నప్పటికీ సరైన సౌకర్యాలు లేక సిబ్బందితో పాటు వివిధ అవసరాల నిమిత్తం వచ్చే వారికి తిప్పలు తప్పడం లేదు. ఏ కార్యాలయంలోనూ సరిపడా గదులు లేవు.

> **ప్రభుత్వ స్థలాలను గుర్తించాలి**
>
> 
>
> కాజీపేట పట్టణంలో అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. ఆ స్థలాలపై విచారణ చేసి ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించాలి. అందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.
>
> – ఎండీ.చాంద్‌పాషా, బోడగుట్ట

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

హన్మకొండ: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని వరంగల్ పోలీసు కమిషనరేట్ అడిషనల్ డీసీపీ, మానవ అక్రమ రవాణా వ్యతిరేక విభాగం నోడల్ అధికారి ఎస్.రవి సూచించారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫోరం, వరంగల్ పోలీసు కమిషనరేట్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సంయుక్తంగా వాకథాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించాయి. ఈమేరకు పోలీసు హెడ్‌క్వార్టర్స్ నుంచి కాళోజీ కూడలి వరకు వాకథాన్ జరిగింది. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలను ఇబ్బంది పెట్టడం, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, బాలలపై లైంగిక హింస వంటి ఘటనలు జరిగితే 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.



వాకథాన్‌ను ప్రారంభిస్తున్న అడిషనల్ డీసీపీ రవి

ఏసీపీ డేవిడ్‌రాజ్, హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి జయంతి, వరంగల్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వసుధ, ఏఆర్‌డీఎస్పీ అనంతయ్య, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ కోఆర్డినేటర్ శ్రీకాంత్, డాన్‌బాస్కో చైర్మన్ ఫాదర్ కోసి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సంతోష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ అనిత రెడ్డి, హనుమకొండ ప్రాజెక్ట్ సీడీపీఓ విశ్వజ, హనుమకొండ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు సరికాదు

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీలో కార్మిక సంఘాలపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి ఆర్టీసీ కార్మిక ఉద్యమంపై, కార్మికుల నుంచి ప్రశ్నే రాకుండా చేయడం ద్వారా ఆర్టీసీని తమ ఇష్టారాజ్యంగా నడపడం కోసమే 2019 డిసెంబర్‌లో ఆర్టీసీ కార్మిక సంఘాలపై కేసీఆర్ ప్రభుత్వం ఆంక్షలు విధించిందని గుర్తుచేశారు. ఆ ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, ఉపాధ్యక్షుడు గాదె ప్రభాకర్ రెడ్డి, మెట్టు రవి, పుల్లా అశోక్, నాయకులు బి.సంపత్, వై.శ్రీనివాస్, ఆర్.రమణ, యాకోబు, బొల్లారం సంపత్, చిరంజీవి, మల్లయ్య, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఖిలా వరంగల్: 57వ జాతీయ గ్రంథాల వారోత్సవాల సందర్భంగా వరంగల్ ఎల్లంబజారులోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈమేరకు విజేతలుగా నిల్చిన కీర్తన, చందన ప్రియ, పల్లవి, శ్రీజ అక్షితకు అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, లైబ్రరీ సెక్రటరీ ఇన్‌చార్జ్ శౌజ, మండల విద్యాశాఖ అధికారి గంప అశోక్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, మెమోంటోలను బుధవారం అందజేసి అభినందించారు. గైడ్ టీచర్ కరుణకుమారి పాల్గొన్నారు.

నైపుణ్యాలు వెలికితీసేందుకు క్రీడలు దోహదం



బహుమతి ప్రదానం చేస్తున్న అతిథులు

రామన్నపేట: పిల్లల్లోని మెళకువలు, నైపుణ్యాలను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సాయికుమార్ అన్నారు. ఆటోనగర్‌లోని బాలుర పరిశీలక గృహంలో బుధవారం నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాలురకు ఖోఖో, కబడ్డీ, మ్యూజికల్ చైర్, క్యారమ్స్, తదితర ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు మెమొంటోలు, సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు ఆటల్లో పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, వరంగల్ జిల్లా సంక్షేమాధికారి రాజమణి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ, వరంగల్ డీసీపీఓ రాజు, హోమ్ సూపరింటెండెంట్ శ్రీదేవి, జువైనల్ బోర్డు సభ్యులు సుభాష్, గోపికారాణి, హోమ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

విద్యారణ్యపురి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కళ్లకు గంతలు కట్టుకొని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్ మాట్లాడుతూ ఫీజు బకాయిలు విడుదల చేస్తామని ఎన్నికల ముందు చెప్పి ఇప్పటి వరకూ ప్రభుత్వం విడుదల చేయలేదని ఆయన విమర్శించారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించి, విద్యార్థులకు న్యాయం చేయాలని సంతోష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వేల్పుల చరణ్, కె.కుమార్, కసరబోయిన రవితేజ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు



హసన్‌పర్తి: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని కేయూ జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ షమిత అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని కిట్స్ కళాశాలలో బుధవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం వైపు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం వ్యాస రచన, వక్తృత్వం, ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, లైబ్రేరియన్ డాక్టర్ ఇంద్రసేనారెడ్డి, డాక్టర్ నిరంజన్‌రెడ్డి, డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ సుమలత, పీఆర్వో డాక్టర్ ప్రభాకరాచారి పాల్గొన్నారు.

దివ్యాంగులకు పింఛన్ పెంచాలి

హన్మకొండ: ఎన్నికల హామీ మేరకు దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెంచాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు వికలాంగుల పింఛన్ నెలకు రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను మంద కుమార్ మాదిగ ప్రారంభించి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇంకా పింఛన్ పెంచలేదని విమర్శించారు. ఈ డిమాండ్ సాధనకు ఈనెల 26న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు బొడ్డు దయాకర్, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు అమరాజు స్వామి, బాపురాజు యాదవ్, సింగారపు రజిత, కన్నారి చంద్రశేఖర్, సింగారపు స్వామి, వక్కల భాగ్య, సోనబోయిన చేరాలు, గందపల్లి ముత్యాలు, చినపెల్లి కొమురయ్య, లక్ష్మి, ప్రేమలత, యాదమ్మ, యాకలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంద కుమార్‌మాదిగ

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28, 29వ తేదీల్లో రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈమేరకు సదస్సు బ్రోచర్‌ను వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, సోషియాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, అధ్యాపకులు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అకుట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, అధ్యాపకులు డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ పుల్లా రమేష్, సుభాష్, సాహితి, పూర్వ పరిశోధకులు డాక్టర్ పాడిశెట్టి విష్ణువర్ధన్, డాక్టర్ సంగెం శ్రీనివాస్, డాక్టర్ శ్రవణ్‌కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, తదితరులు

షాదీఖానాకు రూ.1.50 కోట్లు

సాక్షి స్పందన

న్యూశాయంపేట: ఎల్బీనగర్ షాదీఖానాకు ప్రభుత్వం రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. కుడా నిధులతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టారు. అనంతరం నిధుల లేమితో స్లాబ్ లెవల్ వద్ద పనులు ఆగిపోయాయి. ఈమేరకు షాదీఖానాలపై సాక్షి దినపత్రికలో కథనం మంగళవారం ప్రచురితం కావడంతో ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి మంత్రి కొండా సురేఖ తీసుకెళ్లగా నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న హైమావతి

హన్మకొండ అర్బన్ / హన్మకొండ: సఖి వన్ స్టాప్ కేంద్రం అందిస్తున్న సేవలను బాధిత మహిళలు, బాలికలు వినియోగించుకోవాలని సఖి వన్ స్టాప్ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ హైమావతి సూచించారు. ఎక్సైజ్ కాలనీలోని సఖి సెంటర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ సఖి కేంద్రం ద్వారా మహిళలకు కౌన్సెలింగ్, వైద్యం, పోలీస్, తాత్కాలిక వసతి, న్యాయ సహాయం అందించనున్నట్లు వివరించారు. సఖి కేంద్రం సిబ్బంది 24 గంటలపాటు అందుబాటులో ఉంటారని, ఏదైనా సమస్య ఉంటే 181, 0870 2452112, 73829 83088 నంబర్‌కు కాల్ చేసి తక్షణ రక్షణ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సఖి లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి, సోషల్ కౌన్సెలర్ విజయలక్ష్మి, కేస్ వర్కర్ హరిత, వినీల, ఐటీ సునీత, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సీఎంకు కుడా చైర్మన్ ధన్యవాదాలు

నయీంనగర్: కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం, మాస్టర్ ప్లాన్ –2041 ఆమోదం, ఐఆర్ఆర్‌కు నిధులు మంజూరు చేసినందుకు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఎస్సార్‌లో రక్తదాన శిబిరం

హసన్‌పర్తి: ఎస్సార్ యూనివర్సిటీలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నర్ రావత్, ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, డీన్ కేవీ.సుధాకర్, రెడ్‌క్రాస్ సభ్యుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎంజీఎం ఆస్పత్రిపై దృష్టి సారించాలి

హన్మకొండ: పేదల ఆస్పత్రి ఎంజీఎంపై జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని, ఆస్పత్రిలోని సమస్యలను పరిష్కరించాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. హనుమకొండ సుబేదారిలో బుధవారం జరిగిన ప్రజావేదిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా ఎంజీఎం ఆస్పత్రిలో నెలకొన్న పరిస్థితుల వల్ల పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి

హన్మకొండ కల్చరల్ / ఎంజీఎం: విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు మంచి సంస్థను ఎంచుకోవడం ప్రధానమని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో 2024 – 25వ విద్యా సంవత్సరానికి నూతనంగా ప్రవేశాలు పొందిన బీ.ఫార్మసీ, ఫార్మా డీ విద్యార్థులకు ఓరియంటేషన్, ఇండక్షన్ ప్రోగ్రాంను నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, హెచ్ఓడీలు డాక్టర్ శ్రవణ్ కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ మహేష్, డాక్టర్ శరవణభవ, డాక్టర్ పావని పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర

హసన్‌పర్తి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి గిట్టుబాటు ధర అందిచనున్నట్లు పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాడి మల్లారెడ్డి తెలిపారు. జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా హసన్‌పర్తిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సహకార జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కుమారస్వామి, కర్ణాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఉద్యోగులు శ్రీనివాస్‌రెడ్డి, జయపాల్, రంజిత్ పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలకు చిరుధాన్యాలు దోహదం

హన్మకొండ: పిల్లల ఎదుగుదలకు చిరుధాన్యాలు ఎంతో దోహదపడుతాయని మాస్టర్‌జీ విద్యాసంస్థల అధినేత సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్ అన్నారు. హనుమకొండ రాంనగర్‌లో రికార్డ్ సర్వీస్ సొసైటీ మిల్లెట్ హబ్ ద్వారా విద్యార్థులకు చిరుధాన్యాల ఉపయోగాలపై బుధవారం అవగాహన కల్పించారు. మిల్లెట్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్, రామన్ స్కూల్ కరస్పాండెంట్ రాజేష్, మాస్టర్‌జీ విద్యాసంస్థల అకాడమి కోఆర్డినేటర్ సరళ, సంయుక్త పాల్గొన్నారు.

జీఓ 29ని రద్దుచేయాలి

కేయూ క్యాంపస్: రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న జీఓ నంబర్ 29ని రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు డిమాండ్‌చేశారు. ఈమేరకు యూనివర్సిటీ లైబ్రరీ ఎదుట నిరసన తెలిపారు. కావ్య, అభిరామ్, రమేష్, అశోక్, నరేష్, బాలకృష్ణ, పృథ్వీరాజ్, సంగీత, అనూష, అఖిల, స్వాతి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వరంగల్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినందున పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని జీడబ్ల్యూఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధుల సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో బాధ్యులు కర్రు రమేష్, గొలుసుల సంపత్, అప్పల శ్రీనివాస్, సంతోష్ నాయక్, గంజికోట రాజు, మాధవ శంకర్, హరికృష్ణ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలి

న్యూశాయంపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ – ఈ కేటగిరీ కింద ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ (టీఎస్ – మేసా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎంఏ.ఫారూఖ్ అహ్మద్, తోఫిఖుర్ – రహమాన్ కోరారు. ఈమేరకు బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావును హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు.

బ్యాంక్ అధికారులకు సూచనలు

మడికొండ: మడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఏపీజీవీబీ, ఐఓబీ బ్యాంక్‌ల్లో భద్రతా ఏర్పాట్లను మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా రాత్రి వేళ్లలో సెక్యూరిటీ సిబ్బందిని పెంచుకోవాలని, స్ట్రాంగ్ రూమ్‌లను పటిష్టంగా ఉంచుకోవాలని, సీసీ కెమెరాలు పనితీరును గమనిస్తూ ఉండాలని అధికారులకు సలహాలు, సూచనలు చేశారు.

అంజన్న ఆలయంలో కార్తీక మాసోత్సవం

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలోని దక్షిణముఖ అభయాంజనేయస్వామి దేవాలయంలో కార్తీకమాస ఉత్సవాలను ఆలయ ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీనివాసశర్మ బుధవారం నిర్వహించారు.

అయ్యప్ప భక్త సేవాశ్రమంలో ప్రత్యేక పూజలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి రోడ్డులోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప భక్త సేవాశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు బాలసుబ్రమణ్య శర్మ, నిర్వహక అర్చకుడు గణపతిశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేసీఆర్‌ను విమర్శించే స్థాయి రేవంత్‌కు లేదు

రామన్నపేట: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ని విమర్శించే స్థాయి సీఎం రేవంత్‌రెడ్డికి లేదని జీడబ్ల్యూఎంసీ డిపూటీ మేయర్ రిజ్వానా అన్నారు.

కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రేమ్‌శర్మ మృతి

ఎంజీఎం: నగరంలో ప్రముఖ, మొట్టమొదటి కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రేమ్‌శర్మ (76) అనారోగ్య సమస్యలతో బుధవారం మృతి చెందారు. ప్రేమ్‌శర్మ 20ఏళ్లుగా నగరంలో వేలాది మంది హృద్రోగులకు చికిత్స అందించారు.



ప్రేమ్‌శర్మ (ఫైల్)

22న దివ్యాంగులకు క్రీడాపోటీలు

కాళోజీ సెంటర్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఓసిటీలోని ఇండోర్ స్టేడియంలో దివ్యాంగులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా సంక్షేమ అధికారి బి.రాజమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ విభాగంలో 10 నుంచి 17 సంవత్సరాలు, సీనియర్స్ విభాగంలో 18 నుంచి 54 సంవత్సరాలు ఉన్న మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్ సెర్చ్

ఖిలా వరంగల్: శాంతి భద్రతలను పరిరక్షించేందుకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా తెలపారు. బుధవారం రాత్రి కరీమాబాద్ నానామియా తోటలో కార్డెన్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన తనిఖీల్లో రూ.5వేల విలువైన గుట్కాలు, రూ.2వేల నగదు, 25మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. ఏసీపీ నందిరామ్‌నాయక్, ఇన్‌స్పెక్టర్ గోపి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

23న మహిళల కబడ్డీ జట్టు ఎంపిక

కాశిబుగ్గ: వరంగల్‌లోని ఓసిటీ స్టేడియంలో ఈనెల 23న మహిళల జిల్లా సీనియర్ కబడ్డీ జట్టుకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, కార్యదర్శి అబ్దుల్లాఖాన్, సహాయ కార్యదర్శి కె.మల్లికార్జున్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 75 కిలోల లోపు బరువు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ఆడుతారని వారు తెలిపారు.